

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..

అంబాజీపేట మండలం ముక్కామల - వక్కలంక వంతెన మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందింది. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.




ప్రమాదాల్లో హైవే

హైవే మృత్యుకుహరంలా మారింది. నిత్యం ఏదో ఒక ప్రమాదంతో రక్తమోడుతోంది. రోడ్డు వెంబడి ఆగి ఉన్న వాహనాలే దీనికి కారణమని గుర్తిస్తున్నా చర్యలు కానరావడం లేదు.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 4,048 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రం లోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.65 అడుగులుగా నమోదైంది. డెల్టా కాలువలకు నీరు వదల్లేదు.

న్యూస్‌రీల్

చల్లగా చూడు స్వామీ!



పిఠాపురం: పట్టణంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారు శనివారం విసనకర్రల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉగ్రరూపం చూపిస్తున్న వేసవిలో అందరినీ చల్లగా చూడాలని కోరుతూ స్వామివారికి తాటాకు విసనకర్రలతో అలంకారం చేశామని అర్చకుడు విజయ జనార్దనా చార్యులు తెలిపారు.

వ్యాయామోపాధ్యాయ సంఘ అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌కు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న రవిరాజు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా పెద్దిశెట్టి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్ష ఎన్నికలు రామ్‌కుమార్ వ్యాయామోపాధ్యాయ సంఘ భవన్‌లో ఎన్నికల అధికారి వి.రవిరాజు ఆధ్వర్యాన శనివారం జరిగాయి. మొత్తం 191 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న శ్రీనివాస్‌కు 139 మంది, రవి సుందర్ కొర్‌కు 51 మంది ఓట్లు వేశారు. దీంతో నూతన అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎన్నికైనట్లు ప్రకటించారు.

● గుండె చెరువు

మన్నించండి మహారాజా..

- 1,400 ఎకరాల చెరువును పట్టించుకోని జలవనరుల శాఖ
- మహారాజా సాక్షిగా వందల క్యూసెక్కులు కడలి పాలు
- వేల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం

పిఠాపురం: వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలు కరవు బారిన పడకూడదని.. పంటలు పుష్కలంగా పండాలనే సమున్నత లక్ష్యంతో పిఠాపురం మహారాజా సమకూర్చిన అపార జలనిధిపై జలవనరుల శాఖ అధికారులు అంతులేని నిర్లక్ష్యం చూపుతున్నారు. వేల ఎకరాలకు సాగు నీరు, లక్షలాది మందికి తాగునీరు అందించేందుకు ఆ మహనీయుడు నిర్మించిన భారీ చెరువు నిర్వహణను గాలికొదిలేశారు. కనీసం తూములు కూడా బాగు చేయించకపోవడంతో వందల క్యూసెక్కుల నీరు కడలి పాలవుతోంది. మరోవైపు చెరువు ఆక్రమణల పాలవుతున్నా కబ్జాదారులకు అండగా నిలుస్తూ రైతులు, ప్రజల నోట్లో మట్టి కొడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పిఠాపురం మహారాజా రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ వంశం దాతృత్వానికి ఈ చెరువు మచ్చుతునక. దీనిని నిర్మించిన పిఠాపురం మహారాజా విగ్రహాన్ని ప్రజలు ఆ చెరువు గట్టుపై ఏర్పాటు చేసుకుంటే.. దాని నిర్వహణనూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఆ విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్లతుప్పలు పెరిగిపోయాయి. దీనిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా ఆర్ఆర్‌బీ చెరువు కళింగలు



పిచ్చి మొక్కల మధ్య శిథిలావస్థలో పిఠాపురం మహారాజా విగ్రహం



నిర్వహణకు నోచని ఆర్ఆర్‌బీ చెరువు



శిథిలమైన కళింగల పైభాగం

15 వేల ఎకరాల ఆయకట్టు

పూర్వం తరచూ వర్షాభావ పరిస్థితులతో సాగునీరు లేక, పంటలు పండక రైతులు.. తాగునీరు లేక ప్రజలు, పశువులు అల్లాడిపోవడం చూసి మహారాజా కలత చెందారు. భవిష్యత్తులో ఎంత కరవు వచ్చినా తన రాజ్యంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని భావించారు. ఈ నేపథ్యంలో రాజా రావు బహద్దూరు (ఆర్ఆర్‌బీ) పేరిట 1841లో గొల్లప్రోలు మండలం చేబ్రోలు – మల్లవరం మధ్య 1,416 ఎకరాల విస్తీర్ణంలో పిఠాపురం మహారాజా అతి పెద్దదైన ఈ చెరువును నిర్మించారు. పదేళ్ల పాటు వానలు కురవకపోయినా సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు, 2 లక్షల మందికి తాగునీరు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా పిఠాపురం మహారాజా చర్యలు తీసుకున్నారు. కొత్తపల్లి, గొల్లప్రోలు, తొండంగి మండలాల్లోని నాగులాపల్లి, రమణక్కపేట, ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం, శ్రీరాంపురం, రావివారిపోడు, ముమ్మిడివారిపోడు, ఏవీ నగరం, కోదాడ, రావికంపాడు, ఎ.విజయనగరం, దుర్గాడ, తొండంగి తదితర 30 గ్రామాల్లోని దాదాపు లక్ష కుటుంబాలు ఈ చెరువుపై ఆధారపడి ఉన్నాయి. పిఠాపురం బ్రాంచి కెనాల్, సుద్దగెడ్డ కాలువల నుంచి ఈ చెరువులోకి నీరు ప్రవహిస్తూంటుంది. ఈ చెరువు కింద ప్రస్తుతం సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 50 వేల మంది రైతులు సాగు చేసుకుంటున్నారు.

మహారాజా సాక్షిగా మట్టి పాలవుతున్న జలనిధి

ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ చెరువు నిర్వహణపై జలవనరుల శాఖ అధికారులు నిర్లక్ష్యం చూపుతూండటంతో ఇది కాస్తా మట్టిదిబ్బగా మారుతోంది. ఈ చెరువుకు 14 తూములు, ఒక కళింగలు ఉన్నాయి. చెరువు నిండా నీరు పెడితే పదేళ్ల పాటు 15 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందుతుంది. అయితే తూములు, కళింగలు పూర్తి అధ్వాన స్థితికి చేరుకోవడంతో వర్షాలు కురిసినప్పుడు అదనపు నీరు వచ్చినా.. నిల్వ చేసే అవకాశం ఉండటం లేదు. ఈ తూముల షట్టర్లు పూర్తిగా శిథిలమై, మట్టితో పూడుకుపోవడంతో ఎప్పటి నీరు అప్పుడే సముద్రంలోకి పోతోందని రైతులు వాపోతున్నారు. ఈ విధంగా సుమారు 2 టీఎంసీల నీరు సముద్రం పాలవుతోందని అంచనా. మరోవైపు తూములు పూడుకుపోయి సాగు నీరు అందక పంటలు నష్టపోతున్నారు. ఏటా కోట్లాది రూపాయలతో పనులు చేస్తున్నట్లు చెప్పుకునే ఇరిగేషన్ అధికారులు ఈ చెరువు వంక కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

ప్రాచీన చరిత్ర, అత్యంత ప్రాధాన్యం కలిగిన ఈ చెరువు అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో, వరదలు, అధిక వర్షాలు వచ్చినప్పుడు ఆయకట్టులోని వేలాది ఎకరాల్లో పంటలు ముంపు బారిన పడి, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చెరువులో నీటిని నిల్వ చేసే వీలు ఉండటం లేదు. ఫలితంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ చెరువును అభివృద్ధి చేయాలని, కళింగలు, తూములకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

తాత్కాలిక మరమ్మతులు

ఆర్ఆర్‌బీ చెరువు తాత్కాలిక మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. తాత్కాలిక మరమ్మతులకు మాత్రమే నిధులు విడుదలవుతున్నాయి. పూర్తి స్థాయిలో అభివృద్ధికి ఇంకా ఎటువంటి నిధులూ విడుదల కాలేదు.

– సంతోష్ కుమార్, డీఈ, జలవనరుల శాఖ

మట్టి తవ్వకాలపై కన్నెర్ర

- పాపిడిదొడ్డి చెరువులో అడ్డుకున్న ఎఫ్‌కే పాలెం రైతులు
- ఇరు వర్గాల మధ్య ఘర్షణ, తోపులాట



ఇరు వర్గాలనూ చెదరగొడుతున్న పోలీసులు

పిఠాపురం: ఎఫ్‌కే పాలెం పాపిడిదొడ్డి చెరువులో అక్రమంగా మట్టి తవ్వుతున్నారంటూ రైతులు శనివారం కన్నెర్ర చేశారు. మట్టి తవ్వడానికి తీసుకువచ్చిన యంత్రాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు, మట్టి మాఫియాకు మధ్య తీవ్ర స్థాయిలో తోపులాటలు, వాదోపవాదాలు జరగడంతో సుమారు రెండు గంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంతో సంబంధం లేని ఇటుక బట్టీల వ్యాపారులు దాడికి ప్రయత్నించడంతో స్థానిక రైతులు కొందరు కింద పడిపోయారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితం కావడంతో రైతులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మట్టి వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా కనీసంగా కూడా నోరు మెదపడం లేదని, మట్టి అక్రమార్కులకు వత్తాసు పలకడమేమిటని ప్రశ్నించారు. అయితే, మట్టి తవ్వకాలకు అనుమతులున్నాయని, అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు పరోక్షంగా హెచ్చరించారు. మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకుని తీరుతామని రైతులు స్పష్టం చేశారు. మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్న చెరువును సీపీఎం జిల్లా సీనియర్ నాయకుడు డి.శేషుబాబ్జీ, స్థానిక నాయకులు కుంచె చిన్న, కోనేటి రాజు శనివారం పరిశీలించారు. రైతులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. మరోవైపు పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) పీడీ చైత్రవర్షిణి, కాకినాడ ఆర్‌డీఓ మల్లిబాబు, సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ గోపాలకృష్ణ ఇరు వర్గాలతో చర్చలు జరిపారు.

ఫ్చ్.. కళ కట్టలే..

- కల్యాణం నాడు అంతంత మాత్రంగా అలంకరణ
- వనదుర్గ అమ్మవారికి హోమాల నిలిపివేతపై వివాదం
- రథోత్సవానికి ఎండదెబ్బ
- శ్రీపుష్పయాగంలో సంప్రదాయానికి భిన్నంగా స్వామికి కుడివైపు అమ్మవారు
- సత్యదేవుని కల్యాణోత్సవాలపై భక్తుల పెదవి విరుపు

అన్నవరం: గతంతో పోలిస్తే ఈ ఏడాది సత్యదేవుని కల్యాణోత్సవాలు పెద్దగా కళ కట్టలేదనే విమర్శ భక్తుల నుంచి వస్తోంది. అలంకరణల నుంచి సంప్రదాయానికి విరుద్ధంగా కొన్ని క్రతువులు నిర్వహించడం వరకూ ఇప్పటికీ చర్చ నడుస్తోంది.

పూర్తి స్థాయిలో కానరాని అలంకరణ

- సత్యదేవుని కల్యాణోత్సవాలు ఈ నెల 7 నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణం 8వ తేదీ రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ వేదిక అలంకరణ బాగుంది. కానీ, వేదిక ముందున్న విశ్రాంతి షెడ్డు పై భాగంలో ఎటువంటి అలంకరణా చేయలేదు. ఏటా కల్యాణోత్సవాల సందర్భంగా ఈ షెడ్డు పై భాగాన్ని అందమైన వస్త్రంతో కవర్ చేసి, దానికి పూలమాలలు, విద్యుద్దీపాలతో అలంకరించేవారు. ఈసారి అటువంటిదేమీ లేకపోవడంతో షెడ్ వెలవెలబోయినట్లు కనిపించింది.
- కల్యాణోత్సవానికి వచ్చిన వీఐపీలకు స్వామివారి ప్రసాదాలు, కల్యాణ అక్షతలతో పాటు నూతన వస్త్రాలు బహూకరించడం ఆనవాయితీ. ఈసారి ముగ్గురు ఎమ్మెల్యేలకు వీటిని అందజేశారు. కానీ, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌కు కనీసం అక్షతలు కూడా ఇవ్వకపోవడం వివాదానికి తావిచ్చింది. దీనిపై ఆయన కల్యాణ వేదిక వద్దనే ఈఓ ముందు అసంతృప్తి వ్యక్తం చేశారు.



శ్రీపుష్పయాగంలో స్వామివారికి కుడివైపున ఉన్న అమ్మవారు

హోమాల నిలిపివేత

రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి ప్రతి శుక్రవారం చండీహోమం, అమావాస్య, పౌర్ణమి నాడు ప్రత్యంగిర హోమం నిర్వహిస్తారు. సత్యదేవుని కల్యాణోత్సవాల్లో కూడా ఈ హోమాలు ఎప్పుడూ ఆపలేదు. ఈసారి మాత్రం ఈ హోమాలు నిలిపివేయడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంపై అన్నివైపుల నుంచీ విమర్శలు రావడంతో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు వైదిక కమిటీ సభ్యులతో గత మంగళవారం సమావేశమయ్యారు. హోమాలు ఎందుకు నిలిపివేశారో వివరణ ఇవ్వాలని నిలదీశారు. వారి నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి వైదిక కార్యక్రమాల నిర్వహణపై శృంగేరి పీఠాధిపతి సూచనలు పాటించాలని నిర్ణయించారు. హోమాల నిలిపివేతపై 'సాక్షి' ఈ నెల 8వ తేదీ నుంచి వరుస కథనాలు ప్రచురించింది. దీనిపై మొదట్లోనే స్పందించి, హోమాలు నిర్వహించాలని ఆదేశించి ఉంటే అసలు ఈ వివాదమే తలెత్తేది కాదు.

రథోత్సవం వెలవెల

- అసలే మే నెల ఎండ.. దానికి తోడు అగ్నికత్తెరలు.. నిప్పులు కక్కుతున్న సూరీడు.. సాయంత్రం ఆరు గంటలకు కూడా బయటకు వెళ్లాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి. ఇటువంటి వాతావరణంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు సత్యదేవుని రథోత్సవం నిర్వహించారు. వాతావరణం వేడిగా ఉండటంతో ఈ ఉత్సవం ప్రారంభంలో పట్టుమని వంద మంది భక్తులు లేరు. చివరిలో అంటే రాత్రి 7.30 గంటల సమయానికి రెండు మూడు వేల మంది మాత్రం వచ్చారు.
- సాధారణంగా రథోత్సవం సందర్భంగా రథానికి కట్టిన పగ్గాలను భక్తులు లాగుతారు. కానీ, భద్రత పేరుతో సత్యదేవుని రథం పగ్గాలను భక్తులను పట్టుకోనివ్వలేదు. ముందు ట్రాక్టర్ ఉంచి, దానికి కట్టి లాగించారు. రథానికి వెనుక సపోర్టుగా జేసీబీకి పగ్గాలు కట్టారు. దీంతో, ఇదేం రథోత్సవమని విస్తుపోవడం భక్తుల వంతైంది.
- ఉత్సవాల్లో ఎప్పుడు ఊరేగింపులు నిర్వహించినా భక్తులకు ప్రసాదాలుగా పులిహోర, శనగలు పంపిణీ చేసేవారు. ఈసారి అటువంటిదేమీ లేదు.

సంప్రదాయానికి విరుద్ధంగా..

ఉత్సవాల చివరి రోజున నిర్వహించిన శ్రీపుష్పయాగం నిర్వహణపై కూడా విమర్శలు వచ్చాయి. ఏటా స్వామివారు పడుకుని ఉండగా, అమ్మవారు ఎడమవైపు ఉండి కాళ్లు ఒత్తుతున్నట్టు పవళింపు సేవలో అలంకరణ చేసేవారు. ఈసారి స్వామివారు అమ్మవారి తొడ మీద పడుకుంటే అమ్మవారు విసనకర్రతో విసురుతున్నట్టు అలంకరించారు. ఈ క్రమంలో సంప్రదాయానికి విరుద్ధంగా స్వామివారికి అమ్మవారు కుడివైపు వచ్చారు. ఇది ఎబ్బెట్టుగా ఉందని పలువురు విమర్శించారు. అమ్మవారి చేతిలో అందమైన రంగురంగుల విసనకర్ర లేదా నెమలి ఈకల విసనకర్రనో ఉంచితే బాగుండేదని, చిన్న తాటాకుల విసనకర్రతో సరిపెట్టేశారని పలువురు పెదవి విరిచారు. ఈసారి శ్రీపుష్పయాగంలో పుష్పాలు కూడా తక్కువగానే ఉపయోగించారు. ఏటా పెద్ద వయస్సున్న వేదపండితుల దంపతులు, ఆ తరువాత అదే వయస్సు కలిగిన ప్రధానార్చకుల ఐదు జంటలకు దంపత తాంబూలాలు ఇచ్చేవారు. కానీ, ఈసారి పెద్దలను పక్కన పెట్టి, చిన్న వయసులో ఉన్న దంపతులకు ఈ తాంబూలం ఇవ్వడం విమర్శలకు తావిచ్చింది. దంపత తాంబూలంలో ఇచ్చిన కొబ్బరి బొండాలు కూడా చాలా చిన్నవిగా ఉన్నాయనే అసంతృప్తి వ్యక్తమైంది.

మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా ఉపసంహరణ

సామర్లకోట: తన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నానని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ శనివారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. సొంత పార్టీకి చెందిన 22 మంది సభ్యులు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ గత నెల 2న జిల్లా కలెక్టర్‌కు విజ్ఞాపన అందజేశారు. ఆ మేరకు ఈ నెల 15న అవిశ్వాస తీర్మానానికి కలెక్టర్ అనుమతించారు. దీనికి ముందుగానే అరుణ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి, కమిషనర్‌కు అందజేశారు. ఈ నేపథ్యంలో రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్లు తిరిగి ఆమె లేఖ ఇవ్వడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చైర్‌పర్సన్ రాజీనామా చేయడంతో అవిశ్వాస తీర్మానానికి మెజార్టీ సభ్యులు రాకపోతే తీర్మానం వీగిపోయిందనే ఎత్తుగడలో భాగంగానే రాజీనామా డ్రామా ఆడారనే వాదనలు వినిపిస్తున్నాయి. అవిశ్వాస తీర్మానంపై చర్చకు 21 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా.. ఆ సమావేశానికి 25 మంది హాజరై అవిశ్వాస తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. అయితే, అలా అవిశ్వాస తీర్మానం చేయడానికి వీలులేదని చైర్‌పర్సన్ అరుణ కోర్టును ఆశ్రయించారు. దీంతో, అవిశ్వాస తీర్మానంపై అధికారికంగా ప్రకటన చేయలేదు. దీనిని ఆధారంగా చేసుకొని అరుణ రాజీనామాను ఉపసంహరించుకుని ఉండవచ్చనే వాదనలు ఉన్నాయి. ఇప్పటికే చైర్‌పర్సన్ అరుణ, ఆమె భర్త కృష్ణమూర్తిలను వైఎస్సార్ సీపీ సస్పెండ్ చేసింది. ఈ నెలలో జరిగే కౌన్సిల్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించే అవకాశం ఉన్నప్పటికీ, అజెండాలోని అంశాలను ఆమోదించకుండా మెజార్టీ సభ్యులు బహిష్కరించే అవకాశం ఉంది. అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందిన తరువాత అజెండాపై ఆమె ఏవిధంగా సంతకం చేస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



రాజీనామా ఉపసంహరణ లేఖ అందజేస్తున్న అరుణ

ప్రమాదాల్లో హైవే


ఆస్పత్రిలో మృతిచెందిన వ్యక్తి

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు, ముగ్గురి మృతి
- రోడ్డు పక్కన వాహనాలు నిలపడంతో ప్రమాదాలు
- రాత్రి సమయాల్లో పొంచి ఉన్న మృత్యుశకటాలు

తుని రూరల్: 'హై'వే మృత్యుకుహరంలా మారింది.. నిత్యం ఏదొక ప్రమాదంతో రక్తమోడుతోంది.. దీనికంతటికీ జాతీయ రహదారి వెంబడి ఆగి ఉన్న వాహనాలే కారణమని గుర్తిస్తున్నా, ఎవరూ పట్టించుకోక సమస్య జఠిలమవుతోంది. రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన భారీ వాహనాలను నిర్దేశించిన ప్రాంతాల్లో కాకుండా హైవే హోటళ్లు, దాబాలు, రద్దీ ప్రాంతాలు, గ్రామాల ప్రధాన కూడళ్లలో నిలపడం ప్రమాదాలకు కారణమవుతోంది. ఇలా తుని మండలం వెలంపేట జంక్షన్ సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘటన అందరినీ కలచివేసింది. ఈ ప్రాంతంలో ఇనుపలోడుతో లారీని నిలపడంతో కారు వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి మృత్యువుతో పోరాడేలా చేసింది. ఈ సంఘటనలో అపోలో ఫార్మసి సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన గెద్దం రామరాజు (38), పశ్చిమ గోదావరి తణుకుకు చెందిన వారాడ సుధీర్ (36), ఏలూరు జిల్లా పోలవరానికి చెందిన షేక్ హజరత్ అలీ (35) మృతి చెందారు. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన గోనా శివశంకర్, రాజమహేంద్రవరానికి చెందిన సీహెచ్ వెంకట సుబ్బారావు తీవ్రంగా గాయపడ్డారు. లారీని ఢీకొన్న సమయంలో ఇద్దరు కారులోంచి ఎగిరి రోడ్డుపై పడ్డారు. కారు నుజ్జునుజ్జయ్యింది. తుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే ప్రమాదం జరగడంతో హుటాహుటిన రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పొక్లెయినర్‌తో ప్రమాదానికి గురైన కారును తొలగించి, వాహనాలను క్రమబద్ధీకరించారు. తుని ఏరియా ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. గాయపడిన శివశంకర్, వెంకట సుబ్బారావులకు తునిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు కాకినాడలో ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ట్రైనీ డీఎస్పీ, రూరల్ సీఐలు పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామరాజు, సుధీర్‌లకు భార్య, ఇద్దరేసి పిల్లలు, హజరత్ అలీకి భార్య, కుమారుడు ఉన్నారు.

అవగాహన, నిఘా అవసరం

జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను వివరించడం, వాహనాలు ఎక్కడెక్కడ నిలపాలో స్పష్టంగా పేర్కొంటూ డ్రైవర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపడాన్ని నివారించేందుకు హైవే, పోలీసులు నిఘా పెంచాలి. అర్ధరాత్రి సమయంలో వేగంగా వెళ్లే వాహనాలకు అతివేగంగా ప్రయాణించినట్టు గుర్తించి జరిమానాలు విధిస్తే కొంతమేరకు ప్రమాదాలు నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు.


ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో సహాయక చర్యల్లో సిబ్బంది

పార్కింగ్ ఉన్నా ప్రమాదాలు

నాలుగు రోడ్లగా జాతీయ రహదారిని విస్తరించినప్పుడు పది కిలో మీటర్ల పరిధిలో వాహనాలకు పార్కింగ్ స్థలాలను కేటాయించారు. పెట్రోల్ బంకులు, ఇతరేతర ప్రధాన గ్రామాల వద్దా అప్రోచ్ రోడ్లను ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రాత్రి వేళల్లో ఎక్కడపడితే అక్కడ భారీ వాహనాలను రోడ్డుకు పక్కగా నిలిపివేస్తున్నారు. అలా నిలిపివేసి ఉన్న భారీ వాహనాలను అర్ధరాత్రి దాటిన తర్వాత వేగంగా వెళ్లే వాహనాలు, ప్రధానంగా ప్రయాణికుల వాహనాలు ఢీకొంటున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 120 కిలో మీటర్లకుపైగా 16వ నంబరు జాతీయ రహదారి ఉంది. దీంతో ఎక్కడో ఒకచోట ఆగిఉన్న వాహనాలను ఇతర వాహనాలు వేగంగా దూసుకువెళ్లి ఢీకొనడం సర్వసాధారణంగా మారింది. దీంతో పెద్ద సంఖ్యలో జనం మృత్యువాత పడుతుండగా, వందలాది మంది క్షతగాత్రులవుతున్నారు. ఇటీవల జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఈ సంఘటనలపై ఆందోళన వ్యక్తి చేసి ప్రమాదాలు నివారణ చర్యలు చేపట్టినా క్షేత్రస్థాయిలో ఆశించిన సత్ఫలితాలు రావడం లేదు.

ఆ ఇంట్లో పెద్ద కష్టం

- సైకిల్‌పై నుంచి పడిపోవడంతో ప్రమాదం
- మంచానికే పరిమితమైన ఇంటి పెద్ద
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు


మంచానికే పరిమితమైన షేక్ అహ్మద్ యాకూబ్ ఆలీషా

కొత్తపేట: ఆ కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది.. రెక్కాడితే గాని డొక్కాడని ఆ ఇంటి పెద్ద ప్రమాదానికి గురై మంచాన పడటంతో అతని 15 ఏళ్ల కుమారుడిపైనే భారం పడింది. ఒకపక్క తండ్రికి వైద్యం, మరోపక్క కుటుంబాన్ని నెట్టుకురావడం ఈ బాలుడికి ఇబ్బందిగా మారింది. ఇలా నలుగురు సభ్యుల ఆ కుటుంబం తీవ్ర దయనీయ స్థితిలో ఉంది. ఆ వివరాల్లోకి వెళ్తే.. కొత్తపేట కొప్పిశెట్టివారి వీధికి చెందిన షేక్ అహ్మద్ యాకూబ్ ఆలీషా (48)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాపీమేస్త్రి వద్ద కూలీగా పనిచేస్తూ ఆలీషా కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నాడు. గతేడాది నవంబరులో ఒకరోజు రాత్రి కూలిపని ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ హెడ్‌లైట్లు కాంతి కంట్లోకి కొట్టి కళ్లు కనిపించక సైకిల్ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో రాళ్లపై పడిపోయాడు. మెడ కింద వెన్నెపూస నరాలు నలిగిపోయి కాళ్లు చచ్చుబడిపోయాయి. మొదట్లో రావులపాలెంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా కొన్ని రోజులు వైద్యం చేశారు. రోగం ముదిరిందే తప్ప తగ్గలేదు. తర్వాత అమలాపురంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వివిధ పరీక్షలు, కొన్ని రోజులు వైద్యం చేసి ఆపరేషన్ పడుతుందని, రూ.6 లక్షల వరకూ ఖర్చవుతుందని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఈ ఆపరేషన్‌కు రూ.30 వేలు మాత్రమే వస్తుందని, మిగిలింది బాధితులే భరించాలన్నారు. అప్పటికే అప్పులు చేసి, బంధువులు, తెలిసిన వారు చేసిన సాయంతో సుమారు రూ.3 లక్షల వరకూ ఖర్చు చేశారు. కానీ ఆరోగ్యం ఏమాత్రం మెరుగుపడలేదు. సరికదా అనారోగ్యం ముదిరి పక్షవాతం వచ్చింది. ఇక ఆర్థిక స్తోమత లేక కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరీక్షలు చేసి ఆపరేషన్ చేస్తాం కానీ పూర్తిగా కోలుకుంటాడని చెప్పలేమని అక్కడి వైద్యులు చెప్పారని బంధువులు అంటున్నారు. దాంతో వద్దని చెప్పడంతో కొన్ని రోజులు వైద్యం చేసి డిశ్చార్జ్ చేశారు. నడవలేక మంచానికే పరిమితమైన ఆలీషాను నెలా, రెండు నెలలకోసారి ఫిజియోథెరపీకి కాకినాడ తీసుకువెళుతున్నారు. వెళ్లిన ప్రతిసారి అంబులెన్స్‌కు రూ.10 వేలు, అక్కడ సిబ్బందికి రెండు, మూడొందలు ఇవ్వాల్సి వస్తుందని అతని భార్య బీబీజా వాపోయారు. భర్త మంచాన పడి, ఆదాయం లేకపోవడంతో పదో తరగతి పాసైన కుమారుడిపైనే వైద్యం ఖర్చులు, కుటుంబ పోషణ పడిందన్నారు. చదువుకు స్వస్తి చెప్పి కూలి పనికి వెళ్తున్నాడని, అయ్యే ఖర్చులకు తన కొడుకు సంపాదన సరిపోక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని బీబీజా ఆవేదనతో చెప్పారు. మంచాన పడిన వారికి ఇచ్చే పింఛను కోసం సదరం క్యాంపునకు వెళితే, 83 శాతం అంగవైకల్యం అని సర్టిఫికెట్‌లో పేర్కొన్నారు. కానీ టెంపరరీ అని రాశారని, దీనివల్ల పింఛను రాదన్నారని బీబీజా వాపోయారు. దీనావస్థలో ఉన్న ఈ కుటుంబానికి దాతలు ఆపన్నహస్తం అందించాలని స్థానిక పీఎంపీ షేక్ హైదర్, మెడికల్ రిప్రజంటేటివ్ షేక్ మక్బుల్ కోరారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

వివాహిత మృతి, నలుగురికి తీవ్ర గాయాలు


ముక్కామల వద్ద రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన కారు, పక్కన ఆర్టీసీ బస్


మృతి చెందిన దొమ్మేటి రేఖాలక్ష్మి


తీవ్ర గాయాలపాలైన శ్రావణ్‌కుమార్

అంబాజీపేట: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అంబాజీపేట మండలం ముక్కామల, వక్కలంక వంతెనకు మధ్య ప్రధాన రహదారిపై ఈ ఘటన జరిగింది. స్థానికులు, సమీప బంధువుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా నిజామ్‌పేటకు చెందిన దొమ్మేటి శ్రావణ్‌కుమార్, అతని భార్య రేఖాలక్ష్మి (38), వీరి కుమార్తెలు లాస్య, మోహనగన ప్రియతో పాటు రేఖాలక్ష్మి అమ్మమ్మ కె.ధనలక్ష్మితో కలసి కారులో శనివారం ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లారు. అనంతరం అమలాపురం వెళుతున్నారు. ఈ నేపథ్యంలో ముక్కామల వచ్చేసరికి అమలాపురం నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్‌ను వీరి కారు బలంగా ఢీకొంది. దాంతో కారులో ఉన్న రేఖాలక్ష్మికి తీవ్రగాయాలు కాగా 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకు వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. శ్రావణ్‌కుమార్, లాస్య, మోహనగన ప్రియ, ధనలక్ష్మిలకు తీవ్ర గాయాలు కాగా అమలాపురంలో ఓ ఆస్పత్రికి తరలించారు. రేఖాలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై కె.చిరంజీవి పరిశీలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రావణ్ కుమార్ నిజామ్‌పేటలో స్థిరపడి అక్కడే వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇతనిది యానం కాగా, మృతురాలి తల్లిదండ్రులది అమలాపురం.

పళ్లాలమ్మ జాతరకు వచ్చి...

వారం రోజుల కిందట నిజామ్‌పేట నుంచి వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారి జాతర చూసేందుకు వచ్చి అమలాపురంలో మృతురాలి తల్లి ఇంటి వద్ద బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు. వాడపల్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులంతా కలసి వెళ్లారు. అనంతరం యానం వెళ్దామనుకుని అమలాపురం వస్తుండగా ప్రమాదం జరిగిందని బంధువులు చెప్పారు. వారం రోజుల పాటు బంధువులతో సంతోషంగా గడిపిన ఆ కుటుంబానికి ఇంతలో ప్రమాదం జరగడంతో అంతా కన్నీరుమున్నీరు అవుతున్నారు. వేసవి సెలవులకు వచ్చిన ఆ కుటుంబంలో విషాదం నెలకొంటుందని అనుకోలేదని బంధువులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

అనుమానాస్పద స్థితిలో జంట ఆత్మహత్య?


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో ఒక జంట అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శనివారం కలకలం రేపింది. సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ కథనం ప్రకారం.. సామర్లకోట నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఓ రైలుకు అడ్డుగా ఆ జంట నిలబడి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాల వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో రైల్వే పోలీసులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి వాటిని తరలించారు. అయితే కాకినాడలోని ఓ ఆఫీస్‌లో అకౌంటెంట్‌గా సదరు వ్యక్తి పని చేస్తున్నట్లు, ఆ మహిళ నర్సుగా విధులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారని రైల్వే మేనేజర్ రమేష్ వివరించారు. ఆ జంటకు వేర్వేరుగా వివాహాలు కాగా, ఇద్దరూ కలసి ఆత్మహత్య చేసుకోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ వ్యవహారంపై పోలీసులు రాత్రి వరకూ ఎటువంటి వివరాలు చెప్పకపోవడం గమనార్హం.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి


ఈశ్వరరావు (ఫైల్)

తుని: తుని– అన్నవరం మధ్యలో రైలు నుంచి జారి పడి అర్లి ఈశ్వరరావు (23) మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం కొంపంగి గ్రామానికి చెందిన ఈశ్వరరావు తొండంగి మండలం దివీస్ ఫార్మా కంపెనీలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇటీవల సొంత గ్రామానికి సెలవుపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గజపతినగరంలో రైలు ఎక్కి అన్నవరం రైల్వే స్టేషన్‌కు వస్తుండగా జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద సెల్ ఫోన్ ఆధారంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మరొకరికి గాయాలు


చంద్రకళ (ఫైల్)

పిఠాపురం: దైవ దర్శనానికి కాలి నడకన వెళ్తున్న ఇద్దరు మహిళలను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలైన సంఘటన పిఠాపురం శివారు రాపర్తి జంక్షన్ వద్ద శనివారం చోటుచేసుకుంది. పిఠాపురం పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. గొల్లప్రోలుకు చెందిన తొగర సూర్యలక్ష్మి, అడపా చంద్రకళ (35)లు శనివారం తెల్లవారుజామున గొల్లప్రోలు నుంచి పెద్దాపురం మండలం చిన తిరుపతి బయలుదేరారు. నడుచుకుంటూ వెళుతుండగా పిఠాపురం శివారు రాపర్తి జంక్షన్ వద్దకు వచ్చేసరికి అతి వేగంగా వచ్చిన ఒక గుర్తుతెలియని వాహనం వారిద్దరినీ బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలైన అడపా చంద్రకళ అక్కడికక్కడే మృతి చెందగా, సూర్యలక్ష్మికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన సూర్యలక్ష్మిని హైవే అంబులెన్సులో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. పిఠాపురం పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త త్రిమూర్తులు అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటుండగా, కుమారుడు రాజేష్ ఇటీవలే పదో తరగతి పాసై ఇంటర్‌లో జాయిన్ అయ్యేందుకు సిద్ధపడుతున్నాడు. వీరిది నిరుపేద కుటుంబం. అంతా తానై కుటుంబాన్ని చూసుకునే చంద్రకళ మృత్యువాత పడడంతో ఆ కుటుంబం వీధిన పడిందని స్థానికులు, బంధువులు ఆవేదన చెందుతున్నారు. నీకు నాలాగ పేదరికం ఉండకూడదని, తనను తల్లి చదివిస్తుందంటూ కుమారుడు రాజేష్ గుండెలవిసేలా విలపించాడు.

వ్యక్తి దుర్మరణం

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు ముద్దా పెంటయ్య (72), అప్పలనాయుడు బైక్‌పై అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం వెళ్తున్నారు. ప్రత్తిపాడు ఎస్‌హెచ్‌పై శ్రీపాదాలమ్మ అమ్మవారి ఆలయ సమీపాన రోడ్డు పక్కన గల సేఫ్టీ రెయిలింగ్‌ను వారు ఢీకొన్నారు. గాయపడిన తండ్రీ కొడుకులను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా, చికిత్స పొందుతూ పెంటయ్య మృతి చెందాడు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శుభములివ్వు శనైశ్చరా...

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామివారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవదాయ– ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,31,130 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.31,748 వచ్చాయన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తే చర్యలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డ్రగ్స్ కంట్రోల్ అడిషనల్ డైరెక్టర్ డి.నాగమణి తెలిపారు. ఈగల్ టీం, డ్రగ్స్ కంట్రోల్, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా పూర్వపు ఉభయ గోదావరి జిల్లా పరిధిలో కొద్దిరోజులుగా మందుల దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నట్లు నాగమణి శనివారం తెలిపారు. ఇందులో పలు దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. వీటిలో కార్పొరేట్ మందుల దుకాణాలైన రాజమహేంద్రవరంలోని మేఘన మెడికల్స్‌లో ఈగల్ టీం, విజిలెన్స్, తమ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేశామన్నారు. ఏవీరోడ్డులోని మేఘన మెడికల్స్‌లో పలు అవకతవకలు బయటపడ్డాయన్నారు. వైద్యుని చీటీ లేకుండా నార్కోటిక్ డ్రగ్స్, హెచ్‌వన్ డ్రగ్స్ అమ్మకాలు జరపడం గుర్తించామన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ విక్రయించినందుకు 90 రోజుల పాటు, మిగతా మందుల అనధికార విక్రయాలపై 7 రోజుల పాటు మేఘన మెడికల్స్‌ను సస్పెండ్ చేశామన్నారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలకు అనుగుణంగా మందుల దుకాణదారులు నడుచుకోవాలని అన్నారు.

అనాథరక్షకా.. ఆపద్బాంధవా..

- గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి
- ఒక్కరోజే రూ.51.96 లక్షల ఆదాయం


వాడపల్లి ఆలయం వద్ద భక్తుల కోలాహలం

కొత్తపేట: అనాథరక్షకా.. ఆపద్బాంధవా.. గోవిందా.. అంటూ వేలాది భక్తులు ఆ స్వామిని కొలిచారు. గోవింద నామస్మరణతో ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం మార్మోగింది. శనివారం వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు వాడపల్లి బాట పట్టారు. గౌతమీ గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి తలనీలాలు సమర్పించారు. భారీ క్యూలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. ఏడు శనివారాల నోము ఆచరించే భక్తులు మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దేవదాయ– ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఇతర అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు సుప్రభాత సేవతో ప్రారంభించి వివిధ సేవలు నిర్వహించారు. రంగురంగుల సుగంధ భరిత పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. స్వామి దర్శనం, తీర్థప్రసాదాలు స్వీకరణ అనంతరం అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ ఒక్కరోజు దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ.51,96,999 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. ఆలయం వద్ద రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ఎస్‌ఐ ఎస్.రాము బందోబస్తు పర్యవేక్షించారు. అలాగే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా వాడపల్లికి ప్రత్యేక బస్సులు నడిచాయి.